క్లుప్తంగా

జీవ వైవిధ్యాన్ని సంరక్షించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చలపతిరావు

మల్కాపురం: ప్రకృతిలో ప్రతీ జీవికీ ప్రాధాన్యం ఉందని కళారత్న సుంకర చలపతి రావు తెలిపారు. వాటన్నింటినీ కాపాడుకో వల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన మాట్లా డారు. జీవ వైవిధ్యం వలన ఆహార భద్రత ఏర్పడుతుందన్నారు. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, పశు పోషణ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. వాతా వరణ మార్పులను తట్టుకునే శక్తి జీవ వైవిధ్యం ఇస్తుందన్నారు. అందుకే జీవ వైవిధ్యాన్ని సం రక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికా రులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయా దేవి, గ్రంథాలయాధికారి అజేయకుమార్ తది తరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బుల పంపిణీ



సరకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె, ఇతర సామగ్రిని కార్పొరేటర్ బొ మ్మిడి రమణ గురువారం పంపిణీ చేశారు. నగరాన్ని శుభ్రంగా ఉంచుతూ, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న పారిశుధ్య కార్మికులు వారి ఆరో గ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

రైతుబజారు పరిశుభ్రం



రైతుబజారు ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారును 92వ వార్డు శానిటరీ సిబ్బంది గురువారం ప్రత్యేక డ్రైవ్‌గా శుభ్రం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలుల వల్ల చెత్త పేరుకు పోయింది. దీంతో రైతు బజారు బయట ప్రాంగణమంతా వారు శుభ్రం చేశారు. దీంతో సిబ్బంది, వినియోగదా రులు హర్షం వ్యక్తం చేశారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి కనకరాజు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామ్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల ఆటపాటలతో సందడిగా సాగుతోం ది. పుస్తకపఠనం, వాలీబాల్, క్విజ్, చిత్రలేఖనం తదితర అంశాల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గ్రంథాలయా ధికారి బి.కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులు యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకో వాలని సూచించారు. దీనివల్ల ఆరోగ్యంగా ఉం డవచ్చన్నారు. నీతికథల పుస్తకాలను చదవడం వల్ల విలువలు పెంపొందుతాయన్నారు. మొక్కలను నాటి వాటి సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గొల్ల కంచరపాలెంలో పనిచేయని బోరు



గౌరీనగరలో సక్రమంగా నీరు రాని బోరు

బోరు మంటున్నాయి

- సక్రమంగా పనిచేయని బోర్లు
- మహిళల అవస్థలు



ఊర్వశి కూడలిలో బోరు హ్యాండిల్‌ను కొట్టేందుకు వీల్లేకుండా ఇలా..

కంచరపాలెం: వేసవిలో తాగునీటి బోర్లు సక్రమం గా పని చేయక జీవీఎంసీ 56, 57 వార్డుల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం, దుర్గానగర్, ఊర్వశికూడలి పరిధి గౌరీనగర్, సుభాష్‌నగర్, సిద్ధార్థ నగర్, తుమ్మడపాలెం తదితర ప్రాంతాల్లో కొన్ని బోర్లు మరమ్మతులకు గురై, మరికొన్ని నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది.

ఇదీ పరిస్థితి..

కొన్ని చోట్ల బోర్లు పని చేస్తున్నా, వాటి బేస్‌మెంట్లు శిథిలావస్థలో ఉండటం, మెట్లమార్గాల్లో బోరు వేయడం, చేతిపంపు హ్యాండిల్స్ కొట్టేందుకు వీలు లేకపోవడం, మరికొన్ని చోట్ల హ్యాండిల్స్ పనిచే యకపోవడంతో నిరుపయోగంగా పడిఉన్నాయి. బోర్లు హ్యాండిళ్లు ఎక్కువసేపు కొడితే తప్ప నీరు రాని బోర్లు కొన్ని ఉండగా.. మరికొన్ని చోట్ల బురద, నురగ నీరు పడుతోందని చెబుతున్నారు. పనిచేయని బోర్లకు తక్షణమే మరమ్మతులు చేయా లని, శిథిలావస్థలో ఉన్న బేస్‌మెంట్‌లకు కొత్త సిమెంటు దిమ్మలు నిర్మించాలని, తుప్పు పట్టిన హ్యాండిల్స్, బోర్ల స్థానంలో కొత్తవాటిని వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వీటిపై అధికారులకు ఫిర్యాదు చేశామని తెలియజే స్తున్నారు. సంబంధిత జోన్–5 మంచినీటి విభాగాధికారులు పరిశీలించి, బోర్ల సమస్యలకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

బోరు హ్యాండిల్ పని చేయడం లేదు

ఊర్వశి కూడలి గౌరీనగర్‌లో బీఆర్‌టీఎస్ రహదా రిని ఆనుకుని ఉన్న మంచినీటి బోరు హ్యాండిల్ వరకు రోడ్లు వేయడంతో నీరు పట్టేందుకు ఇబ్బం ది పడుతున్నాం. దీనిపై సిబ్బందికి చెప్పినా పట్టిం చుకోవడం లేదు. దీంతో వేరే బోరు దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.

– ఎస్.నాగమణి స్థానికురాలు, సుభాష్‌నగర్, ఊర్వశికూడలి

చాలా ఇబ్బంది పడుతున్నాం

వీధి కుళాయిలు రాని సమయంలో బోరు నీటినే అందరం వాడుకుంటున్నాం. కానీ బోర్లు పాడవడంతో చాలా ఇబ్బంది పడుతు న్నాం. ఎంతో దూరం వెళ్లి నీళ్లు తేవాల్సి వస్తోంది. పని చేయని బోర్లకు మరమ్మతులు చేస్తే మాకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు స్పందించాలి.

– కె.ప్రసన్నకుమారి, గొల్ల కంచరపాలెం

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



ప్రశాంతినగర్‌లో భక్తుల పూజలు అందుకుంటున్న హనుమాన్



అన్నప్రసాదం వడ్డిస్తున్న జియ్యాని శ్రీధర్

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- అంజనాసుతునికి ప్రత్యేక పూజలు

గోపాలపట్నం: హనుమజ్జయంతిని నియోజకవర్గం లో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో రామబంటుకు విశేష పూజలు చేశారు. ఆంజనేయస్వామిని విశేషం గా అలంకరించి, తమలపాకులు, పత్రాలు, పుష్పా లతో అర్చించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజ రయ్యారు. స్థానిక ప్రశాంతినగర్‌లోని ఆలయంలో ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే గణబాబు దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు స్వామి తీర్థ ప్రసా దాలు శేష వస్త్రాలు అందించారు.

52వ వార్డులో అన్నసమారాధన

విశాఖవిద్య: హనుమజ్జయంతిని ఎన్ఏడీ పరిసర కాలనీల్లో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ 52వ వార్డు ఓల్డ్ కరాస మెయిన్ రోడ్డు శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయాన్ని నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకు న్నారు. స్వామికి పూజలు చేశారు. ఆలయ నిర్వాహ కులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమం లో 52వ వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్, గుజ్జి రాము, ఉమా రెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో హనుమజ్జ యంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జింక్ ఆం జనేయస్వామి ఆలయం వద్ద జరిగిన పూజల్లో ప్రభుత్వ విప్ పి.గణబాబు పాల్గొన్నారు. స్వామి వారిని తమలపాకులు, సిందూరంతో అర్చించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారం భించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కూటమి నాయ కులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ కేంద్రాల్లో అసౌకర్యాలు



కేంద్రం ముందు రోడ్డుపైనే వేచి ఉన్న అభ్యర్థులు



బ్యాగుల కోసం ప్రత్యేక కౌంటర్

- నడిరోడ్డుపైనే విద్యార్థుల పడిగాపులు
- బ్యాగుల భద్రం పేరిట డబ్బుల వసూలు

విశాఖ విద్య: ఏపీ ఈఏపీసెట్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులను అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. పరీక్ష రాసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు మరింత టెన్షన్‌కు గురిచేస్తున్నాయి. నగరంలోని ఎన్ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపా లెంలోని అరోవనా డిజిటల్ జోన్‌లో ప్రస్తుతం ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు జరుగుతున్నాయి. కేంద్రం వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం వద్ద పార్కిం గ్ సదుపాయం లేకపోవడంతో ద్విచక్రవాహనా లపై వస్తున్న విద్యార్థులు వాటిని రోడ్డుపక్కనే పార్కింగ్ చేస్తున్నారు. అదే విధంగా విద్యార్థులు, వారితో వచ్చే సహాయకులకు సమీపంలో ఎక్కడా వేచి ఉండేందుకు సదుపాయం లేకపోవడంతో రోడ్డు మధ్యలోని డివైడర్లపై కూర్చొంటున్నారు. ఆ దారిలో స్పీడుగా వస్తున్న వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

బ్యాగుల కోసం డబ్బులు వసూలు

ఎన్ఏడీ అరోవనా డిజిటల్ జోన్‌కు పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థుల నుంచి బ్యాగులను భద్రపరిచే పేరుతో నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రం భవనంలోనే దీని కోసమని ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. బ్యాగుకు రూ.20లు, సెల్‌ఫోన్‌కు రూ.20లు, బంగారు ఆభరణాలు ఉంటే వాటికి అదనంగా మరికొంత డబ్బులు వసూలు చేస్తున్నారు. దీనిపై నిర్వాహకులను నిలదీసినా. ఇష్టం ఉంటే పెట్టుకోండి.. లేకుంటే వెళ్లిపోండి అని సమాధానమిస్తున్నారు. ఈ విషయాన్ని కొంతమం ది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తెలిపారు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులు పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేలా దృష్టి సారిం చాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీఐల బాధ్యతల స్వీకరణ



గోపాలపట్నం సీఐ ప్రభాకర్



బాధ్యతలు చేపట్టిన మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు

గోపాలపట్నం: బదిలీపై వచ్చిన గోపాలపట్నం, మల్కాపురం సీఐలు విధుల్లో చేరారు. గోపాలపట్నం సీఐగా ఎన్వీ ప్రభాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవ రకు ఇక్కడ సీఐగా పని చేసిన గొలగాని అప్పారావుకు మల్కాపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రభాకర్ విధుల్లో చేరారు. 2004లో ఎస్ఐగా చేరిన ప్రభాకర్ 2012లో సీఐగా పదోన్నతి పొందారు. శాంతిభద్రతల విభాగం, ట్రాఫిక్, సీఐడీ, ఎస్‌బీ విభాగాల్లో పని చేసిన ఆయన తిరిగి గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ నేరాలను నియంత్రించి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సిబ్బంది సహకారంతో పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు. ఆయ నకు ఎస్ఐలు అప్పలనాయుడు, రామారావు, ఏఎస్ఐ అప్పారావు, సిబ్బంది అభినందనలు తెలి పారు.

మల్కాపురం సీఐగా గొలగాని అప్పారావు..

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల విభాగం సర్కిల్ ఇన్‌స్పె క్టర్‌గా గొలగాని అప్పారావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకాలం ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ విద్యాసాగర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో గొలగాని అప్పారావు వచ్చారు. 2002 బ్యాచ్‌కు చెందిన తొలిసారి మల్కాపురం క్రైం ఎస్ఐగా విధులు నిర్వర్తించిన అప్పారావు, తిరిగి 2025లో లా అండ్ ఆర్డర్ సీఐగా వచ్చారు. సిటీ పరి ధిలో క్రైం, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, ఏసీబీలో ఆయన విధులు నిర్వహించారు. ఆయనను స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది ఘనంగా స్వాగతించి, అభినం దనలు తెలిపారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు, ఇతర అధికారులు

దాబాగార్డెన్స్: సరస్వతీ నది పుష్కరాలకు పయన మయ్యే భక్తుల కోసం ఏపీ ఎస్ఆర్‌టీసీ ప్రత్యేక బస్సు లను ఏర్పాటు చేసింది. విశాఖ నుంచి పలువురు ప్రయాణికులు, భక్తులు గురువారం బయలు దేరగా, జిల్లా ప్రజా రవా ణా అధికారి బి. అప్పలనా యుడు ద్వారకాబస్‌స్టేషన్ వద్ద ఇంద్ర ఏసీ బస్సును ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల కోసం ముందుగా సీట్ రిజర్వ్ చేసు కున్న భక్తుల కోసం ఈ బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం, శని వారం ద్వారకాబస్‌స్టేషన్ నుంచి బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సులకు సంబం ధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో apsrtc. com వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులు పూర్తి బస్సును బుక్ చేసుకోవాలన్నా, విడివిడిగా టికెట్లు కావాలన్నా ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, 34 మంది కలిసి వచ్చినట్లయితే వారికి అనుకూలమైన రోజున ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ, యాదాద్రి యాత్రలను కూడా కలిపి ఈ ప్రత్యేక బస్సులను అందించనున్నట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8309265666, 9052227083, 9959225594, 9100109731 నం బర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జీ. సత్యనారాయణ, డిపో మేనేజర్ కె. గంగాధరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ రామ కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొని ప్రయాణికు లకు శుభాకాంక్షలు తెలిపారు.

‘ఉక్కు’ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



గుల్లలపాలెం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని సీఐటీయూ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. కార్మికుల అక్రమ తొలగింపులను వ్యతిరేకిస్తూ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాం ప్లెక్స్ వద్ద గల జీవీఎంసీ కార్యాలయం సమీపంలో గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే యత్నాలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దశల వారీగా అడుగులు వేస్తోందన్నారు. దీనిలో భాగమే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ప్రక్రియ అని వివరించారు. ఎన్నికల ముందు ప్లాం ట్ పరిరక్షణకు పోరాడుతామని, ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారని, ఇప్పుడా మాటలు ఏమ య్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమణ, దుర్గారావు, ఆదినారాయణ, రామారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

గాజువాక: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వ ర్యంలో గాజువాక జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ 2016 నుంచి 2018 వరకు కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఇన్‌కం ట్యాక్స్ సొమ్ము వెనక్కి వచ్చినప్పటికీ చాలా మంది కార్మికులకు జమ చేయలేదన్నారు. 2022 నుంచి పని చేస్తున్న ఆప్కాస్ కార్మికుల మిస్సింగ్ జీతాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆప్కా స్‌లో పని చేస్తున్న కార్మికులు తెల్ల రేషన్ కార్డుకు దరఖాస్తు చేస్తే ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సం దర్భంగా వివిధ సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, ఎ.నూకేశ్వరరావు, గొల్ల రాము, బంగారు నాయుడు, నాగరాజు, గణేష్, కె.వి.రమణ, మీనాక్షి, సత్యవతి, పద్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు



దివ్యాంగ బాలికను పరిశీలిస్తున్న జిల్లా సహిత విద్య సమన్వయకర్త గీత, ఎంఈవో త్రినాథరావు

మల్కాపురం: బడి బయట ఉన్న పద్దెనిమిదేళ్ల లోపు విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు కార్యక్రమాన్ని మల్కాపురం పరిసర ప్రాంతాల్లో గురువారం చేప ట్టారు. మల్కాపురం, క్రాంతినగర్ తదితర ప్రాంతా లలో చేపట్టిన సర్వేలో ఓ దివ్యాంగ బాలికను గుర్తిం చారు. గురువారం ఆ బాలిక ఇంటికి వెళ్లిన జిల్లా సహిత విద్య సమన్వయకర్త డి.గీత, ములగాడ ఎం ఈవో డి.త్రినాథరావు బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న చదువు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వం ద్వారా వారికి వచ్చే ఉపకార వేతనాలు, ఇతర రాయితీలను వారికి వివరించారు. మల్కాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు హరికృష్ణ, ఉపాధ్యాయిని కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కానరాని హెచ్చరికలు.. ప్రమాదకరంగా గుంతలు



ఈఎస్ఐ ఆస్పత్రి ఎదురుగా తవ్వుతున్న గుంతలు

సింధియా: మల్కాపురం పోలీస్ స్టేషన్ సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఎదురుగా పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే.. కాంట్రాక్టర్ గానీ, అధికారులు గానీ కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా.. హెచ్చరిక బోర్డులు లేకుండా పనులు చేపట్టడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇష్టానుసారం గుంతలు తవ్వడంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతు న్నారన్నారు. వర్షాలు పడుతుండడంతో రోడ్డుపై మట్టి పడి, ప్రయాణికులు జారి ప్రమాదాలకు గుర వుతున్నారని తెలిపారు. వెంటనే హెచ్చరిక బోర్డులు, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెల సిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవ స్థానంలో గురువారం త్రికాల పంచామృతాభి షేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనద లిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.